ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## ప్రజాస్వామ్యానికి సవాలుగా మావోయిస్టుల హింస

ఇప్పటివరకు 17 వేలమంది తీవ్రవాదానికి బలి
కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి

2లో..

సంపుటి: 2 | సంచిక: 136 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 25 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# హీరో నాగార్జునకు హైడ్రా షాక్

## మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేత



హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): జీహెచ్ఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా హీరో నాగార్జునకు చెందిన హైదరాబాద్‌లోని మాదాపూర్ ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా బృందం కూల్చి వేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేత పనులు జరిగాయి. కబ్జాదారుల వెన్నులో హైడ్రా వణుకు పుట్టిస్తోంది. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా కూల్చేసింది. ఉదయం భారీ పోలీసు బందోబస్తు నడుమ కన్వెన్షన్ దగ్గరకు చేరుకున్న హైడ్రా అధికారుల బృందం, కూల్చివేతలు ప్రారంభించింది. ఈ కన్వెన్షన్ ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జునకు చెందినదిగా తెలుస్తోంది. అక్రమంగా నిర్మాణం చేపట్టారని ఆరోపణలు వస్తున్న తుమ్మిడి చెరువు 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో ..మిగతా 2లో



## కూల్చివేతలు చట్ట విరుద్ధం

### న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం: హీరో నాగార్జున

హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై సినీ హీరో నాగార్జున స్పందించారు. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కూల్చి వేతలు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్టే ఆర్డర్లు ఉన్నా, ఎన్ కన్వెన్షన్ కూల్చివేత చేపట్టడం బాధాకరమన్నారు. అధికారులు చట్టవిరుద్ధంగా తీసుకున్న చర్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని హీరో నాగార్జున తెలిపారు. ఉదయం కూల్చివేతకు ముందు తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించేలా తాను ..మిగతా 2లో



## మహిళల పట్ల యధాలాపంగా వ్యాఖ్యలు

ఇప్పటికే విచారం వ్యక్తం చేస్తూ ప్రకటన
మహిళా కమిషన్ ముందు హాజరైన కెటిఆర్
రాష్ట్రంలో మహిళల సమస్యలపై కమిషన్‌కు ఫిర్యాదు
రాఖీలు కట్టి పెద్ద మనసు చాటుకున్న మహిళా కమిషన్ సభ్యులు

హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చి రాజకీయం చేశారన్నారు. భారాస మహిళా నేతలపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను గౌరవించాలని విచారణకు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వసతి గృహాల్లో పిల్లల సమస్యలపై ప్రస్తావించినట్లు కేటీఆర్ తెలిపారు. అంతకుముందు విచారణ సందర్భంగా కేటీఆర్‌కు మహిళా కమిషన్ సభ్యులు రాఖీలు కట్టారు. మహిళలపై తాను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చేందుకు ఈరోజు మహిళ కమిషన్ ముందు కేటీఆర్ హాజరయ్యారు. వివరణ ఇచ్చేందుకని ఆయన వస్తే.. మహిళా కమిషన్ సభ్యులు పోటీలు పడి మరీ రాఖీలు కట్టడం ఒకింత ఆశ్చర్యంగా అనిపించింది. విచారణకు పిలిచి కేటీఆర్‌కు రాఖీ కట్టి సోదర అనుబంధాన్ని మహిళా కమిషన్ సభ్యులు చాటుకున్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ విషయంలో మహిళలపై తాను చేసిన కామెంట్స్ యథాలాపంగా చేసినవేనని కేటీఆర్ వివరణ ఇచ్చారు. మహిళలంటే తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలపై ఇటీవల జరిగిన దాడులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. నెల 15వ తేదీన తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంలో మంత్రి సీతక్క ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై కొంతమంది చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్, రికార్డింగ్ డాన్సులు చేసినా తాము ఏమంటామని అంటూ వ్యంగ్యంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున రచ్చ జరిగింది. హిళలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. మహిళల గురించి వివాదాస్పద ..మిగతా 2లో

## చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైకోర్టు తీర్పు



మళ్లీ నాగార్జునకు స్టే ఎలా ఇస్తారు
జడ్జిలు దీనిపై పునరాలోచన చేయాలి
ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై 2014లోనే ఉత్తర్వులు
కెటిఆర్ హయాంలో అనేక చెరువులు మాయం
మెదక్ ఎంపి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

2



## ఉద్యోగుల సామాజిక భద్రతకు నిర్ణయం

### యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని ఆమోదించిన కేబినేట్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): కేంద్ర కేబినెట్ మూడు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. బయో ఈ-3 విధానంతో పాటు విజ్ఞాన్ ధార పథకం, 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పనకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. ఉద్యోగుల సామాజిక భద్రత కోసం కేంద్రం యూనిఫైడ్ పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. సుమారు 23 లక్షల మంది ఉద్యోగులు లబ్ది పొందుతారన్నారు. దీని కోసం రూ.10,579 కోట్ల వ్యయం అవుతుందన్నారు. పారిశ్రామిక, ఐటీ విప్లవాల మాదిరిగా త్వరలో బయో విప్లవం రాబోతోందని చెప్పారు. బయో టెక్నాలజీ, బయో సైన్స్ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు న్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రమంత్రి మండలి సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి మూడు పథకాలకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి వీటిని విజ్ఞాన ధార ..మిగతా 2లో

## వరంగల్ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

### త్వరితగతిన సిద్ధం చేయండి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): వరంగల్ పట్టణాన్ని మరో నగరంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తన కార్యాలయ సమావేశ మందిరంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వరంగల్ నగర అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ పట్టణాన్ని విస్తృత పరచడానికి, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి తగు మాస్టర్ ఎలాన్ సిద్ధం చేసేందుకు గతంలో సమావేశాలు నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు. గతంలో ఉన్న 2041 మాస్టర్ ప్లాన్ ను 2050 నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన సూచించారు. ఇందుకు అవసరమైన భూముల సేకరణ చేపట్టాలని ఆయన అన్నారు. ఇప్పటి వరకు కన్సల్టెంట్లు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ లను మంత్రి ..మిగతా 2లో

## నేను ఏ తప్పూ చేయలేదు

### కుట్రపూరితంగా ఇరికించారు: కోల్‌కతా హత్యాచార నిందితుడు!



కోల్‌కతా, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): కోల్‌కతా హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్ మాట మార్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తనను అక్రమంగా ఇరికించారని కోర్టుకు తెలిపినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నిందితుడితో సహా మరో ఆరుగురికి శనివారం పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. సీబీఐ దర్యాప్తులో నేరాన్ని అంగీకరించిన సంజయ్ పాలీగ్రాఫ్ టెస్ట్‌లో మాటమార్చడం ఇప్పుడు ..మిగతా 2లో




## విద్యుత్ శాఖలో భారీగా పలువురు సూపరింటెండింగ్ ఇంజినీర్ల బదిలీలు

హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): విద్యుత్ శాఖలో (టీజీ ఎస్పీడీసీఎల్) భారీగా ఎస్ఈల బదిలీలు జరిగాయి. సైబర్ సిటీ సర్కిల్ ఏస్ఈగా టి చంద్ర శేఖర్, రాజేంద్ర నగర్ సర్కిల్ ఏస్ఈగా డి.శ్రీరామ్ మోహన్, మేడ్చల్ సర్కిల్ ఏస్ఈ గా ఎం. రవికుమార్, హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఏస్ఈగా డి. సోమిరెడ్డి(ఇటీవల ఎస్ఈగా పొందాడు), సరూర్ నగర్ సర్కిల్ ఏస్ఈగా సి.మాధవ రెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఏస్ఈగా ఎల్. గోపయ్య, బంజారాహిల్స్ సర్కిల్ ఏస్ఈగా పి.కరుణాకర్ బాబు, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఏస్ఈగా పి.వెంకన్న, సంగారెడ్డి సర్కిల్ ఏస్ఈగా శ్రీనాథ్, యాదాద్రి ఎస్ఈగా సుధీర్‌లను బదిలీ చేస్తూ సంస్థ సీఎండి ముషారఫ్ ఫరూఖి ఐఏఎస్ ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం హబ్సిగూడ సర్కిల్ ఏస్ఈగా బ్రహ్మంని బదిలీ చేశారు.

# హీరో నాగార్జునకు హైడ్రా షాక్

**మొదటి పేజీ తరువాయి...**

సుమారు మూడున్నర ఎకరాల భూమిని నటుడు నాగార్జున కబ్జా చేసి కట్టడాలను నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు కొద్ది రోజుల క్రితం హైడ్రాకు ఫిర్యాదు అందడంతో నిర్మాణం చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు, పలు కోణాల్లో పరిశోధించి తదనుగుణంగా చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది.

ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయాలని హైడ్రాకు మంత్రి కోమటిరెడ్డి లేఖ : ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ కు ఈ నెల 21వ తేదీన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ రాశారు. తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎన్ కన్వెన్షన్ ఆక్రమణలను హైడ్రాకు రాసిన లేఖలో మంత్రి కోమటిరెడ్డి వివరించారు. ఈ కన్వెన్షన్‌కు సంబంధించిన శాటిలైట్ ఫొటోలతో సహా ఆధారాలను హైడ్రాకు అందించారు. మంత్రి కోమటిరెడ్డి లేఖపై విచారణ జరిపిన తర్వాతే ఎన్ కన్వెన్షన్ కూల్చివేతని హైడ్రా చేపట్టింది.

తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్ మొత్తం విస్తీర్ణం 29.6 ఎకరాలు : తుమ్మిడి కుంట ఎఫ్‌టీఎల్ మొత్తం విస్తీర్ణం 29.6 ఎకరాలుగా ఉందని అధికారులు తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో 2014లో 2.39 ఎకరాల్లో 19 అక్రమ నిర్మాణాలు చేపట్టారని అన్నారు. 2020లో 4.69 ఎకరాలు ఆక్రమణ జరగగా, ఈసారి 32 నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే తుమ్మిడికుంట బఫర్ జోన్ విస్తీర్ణం 10 ఎకరాలుగా ఉంది. 2014లో 2.05 ఎకరాల బఫర్ జోన్ ఆక్రమణ కాగా 23 నిర్మాణాలు చేపట్టారు. అదే 2020లో 5.02 ఎకరాల బఫర్ జోన్ ఆక్రమణ జరిగ్గా, 81 నిర్మాణాలు చేపట్టారని అధికారు వివరించారు.

హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకే హైడ్రా : హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా( హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) తీసుకొచ్చారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడం, చెరువులను రక్షించడం, విపత్కర పరిస్థితుల్లో నగరానికి అండగా ఉండటం ఈ ఏజెన్సీ ప్రధాన లక్ష్యాలు. ఏజెన్సీ ప్రారంభించిననాటి నుంచి నిత్యం ఏదో ఒకచోట అధికారులు ఆక్రమణలను కూల్చేస్తున్నారు.



## కూల్చివేతలు చట్ట విరుద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్పష్టం చేశారు. తమది పట్టా భూమి అన్న ఆయన, ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేదని వివరించారు. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే ఇచ్చిందని నాగార్జున గుర్తు చేశారు. కేసు న్యాయస్థానంలో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

**న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం**

తప్పుడు సమాచారంతో చట్ట విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేశారని నాగార్జున ఆరోపించారు. తాను చట్టాన్ని గౌరవించే పౌరుడినన్న ఆయన, కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే తామే కూల్చివేసే వారిమని అన్నారు. తాజా పరిణామాలతో ప్రజలకు తప్పుడు సంకేతం వెళ్లే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం ఆక్రమణలు చేశామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. చట్ట విరుద్ధ చర్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. కోర్టులో మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం' అని నాగార్జున స్పష్టం చేశారు.



## ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై స్టే

### హైకోర్టును ఆశ్రయించిన నటుడు నాగార్జున

హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): నాగార్జుకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత వ్యవహారంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే విధించింది. కూల్చివేతలను ఆపేయాలని హైకోర్టు శనివారం నాడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గండిపేట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. అక్రమ కట్టాలను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలోనే తమ్మిడి చెరువును ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించారని ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిని పరిశీలించిన హైడ్రా.. శనివారం ఉదయాన్నే ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నేలమట్టం చేసింది. అయితే, ఈ అంశంపై ఎన్ కన్వెన్షన్ సెంటర్ భాగస్వామ్య యజమాని అయిన అక్కినేని నాగార్జున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పట్టా భూమిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని, ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు నాగార్జున. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేపట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 200 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి మరీ కూల్చివేశారన్నారు. 2014లో అప్పటి ఇరిగేషన్, జిహెచ్ఎంసి అధికారులు బిల్డింగ్‌ని కొలుస్తామని హెచ్చరించారని.. ఎఫ్‌టిఎల్‌లో బిల్డింగ్ ఉందని అప్పటి అధికారులు కూల్చేందుకు వచ్చారని గుర్తు చేశారు. అయితే, 2014లోనే హైకోర్టు ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్టే ఆర్డర్ ఇచ్చిందన్నారు. అప్పటికి ఇంకా ఎఫ్‌టిఎల్‌ను నోటి÷ చేయలేదు కాబట్టి కూల్చే ముందు నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు.

## నేను ఏ తప్పూ చేయలేదు

**మొదటి పేజీ తరువాయి...**

చర్చనీయాంశమైంది. ఈ హత్యాచార కేసుకు సంబంధించి సీబీఐ కస్టడీ ముగియటం వల్ల నిందితుడు సంజయ్‌ను శనివారం కోర్టు ముందు హాజరుపర్చారు అధికారులు. ఈ సందర్భంగా సంజయ్ పాలీగ్రాఫ్ పరీక్షకు అంగీకరించాడు. దర్యాప్తు అధికారులు నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్షలు జరపాలంటే కోర్టుతోపాటు అతడు కూడా అంగీకరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పాలీగ్రాఫ్ పరీక్షకు ఎందుకు అంగీకరించావని మెజిస్ట్రేట్ ప్రశ్నించగా నిందితుడు సంజయ్‌రాయ్ భావోద్వేగానికి గురైనట్లు సమాచారం. ఈ కేసులో వాస్తవాలు వెలుగులోకి రావాలని పాలీగ్రాఫ్ టెస్ట్‌కు అంగీకరించానని పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాను ఏ తప్పు చేయలేదని, ఈ కేసులో తనను కుట్రపూరితంగా ఇరికించారని కన్నీరుపెట్టుకున్నట్లు జాతీయమీడియా కథనాలు వెలువడ్డాయి. అంతకుముందు సీబీఐ విచారణలో నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలొచ్చాయి. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ వైద్యబృందం నిందితుడి మానసికతీరును విశ్లేషించినపుడు ఘటనాక్రమానికి సంబంధించి అడిగిన ప్రశ్నలకు గుక్కతిప్పకుండా చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. నిందితుడిలో కనీసం పశ్చాత్తాపంలేదని ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు తెలిసింది. అయితే ఇంతలోనే నిందితుడు మాటమార్చడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

**గ్యాంగ్‌రేప్ జరగలేదా?**

మరోవైపు హత్యాచార ఘటనలో గ్యాంగ్‌రేప్ జరిగినట్లు కానీ మరికొందరి ప్రమేయం ఉన్నట్లు సీబీఐ పేర్కొనలేదని తెలుస్తోంది. ట్రయల్ కోర్టుకు సీబీఐ సమర్పించిన రిమాండ్ నోట్‌లో అలాంటి విషయాలేవీ లేవని సమాచారం. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ను జ్యుడీషియల్ కస్టడీ విధించాలని మాత్రమే కోరుతున్నట్లు కోర్టుకు తెలిపింది. ఈ మేరకు జడ్జి సెప్టెంబర్ 6వ తేదీ వరకు జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తమ కుమార్తెపై సామూహిక అత్యాచారం జరిగిందనీ కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని మృతురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టుకు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో సీబీఐ రిమాండ్ రిపోర్టులోని అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

## చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైకోర్టు తీర్పు

హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ చేసినన్ని తప్పులు ఎవరూ చేయలేదని భాజపా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దుయ్యబట్టారు. ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టాలని హైకోర్టు 2014లోనే ఉత్తర్వులిచ్చిందని, కానీ, పదేళ్లు అధికారంలో ఉన్న భారాస కూలగొట్టలేదని అన్నారు. ఇందుకు దీనిని తొక్కి పెట్టారో కెటిఆర్ చెప్పాలన్నారు. కోర్టు ఆదేశాలను కూడా బేఖాతర్ చేశారని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెరువులు ఎక్కడెక్కడ కబ్జా చేశారో పదేళ్లు అధికారంలో ఉన్న కేటీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. భారాస, కాంగ్రెస్ నేతలు పరస్పరం తిట్టుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా బృందం కూల్చివేసిన ఘటన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది. మూడున్నర ఎకరాలు తుమ్మడి చెరువును కబ్జా చేసి కన్వెన్షన్‌ను నిర్మించారని అధికారులకు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన హైడ్రా నేలమట్టం చేసింది. ఈ క్రమంలో హైకోర్టునుఆశ్రయించడంతో నాగార్జునకు ఊరట లభించింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. కూల్చివేతలను ఆపేయాలని హైకోర్టు శనివారం నాడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై బీజేపీ ఎంపీ రఘునందనరావు స్పందించారు. 'గౌరవ న్యాయ మూర్తులకు విజ్ఞప్తి.. లంచ్ మోషన్ అని.. ఆగం ఆగం కేసులు వినకండి. ఒక్క బిల్డింగ్ కూలిపోతే ఏమవుతుంది.. 2007, 2008లో చెరువుల కాపాడాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. చెరువులో నిర్మాణాలు ఉంటే ఎలాంటి నోటిసులు ఇవ్వకుండా కూల్చాలని సుప్రీంకోర్టు చెప్పింది. మళ్ళీ జడ్జీలు స్టే ఇచ్చుడు ఏంది..? పిల్లలు నాలల కొట్టుకోపోతే ఏం చేశారు..?. డీ మార్కు చేసిన అనుమతులు లేకుండా కట్టిన నిర్మాణలను కూల్చివేయాలని హైకోర్టు చెప్పింది. ఒక్కసారి హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మళ్ళీ హైకోర్టు జడ్జిలు చేయబడమేంటి..?. దయచేసి హైకోర్టు జడ్జిలు కూడా హైదరాబాద్ చెరువుల పరిరక్షణకు సహకరించాలని న్యాయస్థానానికి రఘునందనరావు విజ్ఞప్తి చేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డ్రామాలు రక్తికట్టించేలా మాట్లాడుతున్నారు. 1994కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో మిరాలం చెరువు కబ్జాపై స్పందించారు. 2010 లో ఎఫ్టీఎల్, శిఖంలలో ఎవరు ఏం కట్టినా కూల్చివేయాలని కోర్టు చెప్పింది. 157జీవోను 6 /4 2010లో ప్రభుత్వం తీసుకుని వచ్చింది. 18మందితో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పుడు మిరాలం ట్యాంక్ పరిస్థితి ఏంటో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. ఎన్ కన్వెన్షన్‌ను 2014లో కూల్చివేయమని హైకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి.. ఎన్ కన్వెన్షన్ వెనుక ఉన్న లాలూచీ ఏంటో కేటీఆర్ చెప్పాలి. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా అధికారులతో కలిపి అధికారుల కమిటీ వేశారు. ముందు కేటీఆర్ జన్వాడా ఫాం హౌస్ కూల్చి వేయండి. కవిత, కేటీఆర్ ఫాం హౌస్‌ను కూల్చేందుకు ఎందుకు భయపడుతున్నారు. హైడ్రా వేసింది మంచి ఉద్దేశ్యంతో అయితే బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కట్టడాలు కూల్చి వేయాలి. కబ్జాలను పాల్పడిన నేతలపై కేసులు పెడితే వారిని ఎందుకు అరెస్టు చేయలేదు. రాజ్ భవన్ రోడ్‌లో నాలాలపై ఆసుపత్రి కట్టారు.. భారీ భవనాలను నిర్మించారు. చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోని కేటీఆర్‌ను మొదటి ముద్దాయిగా అరెస్టు చేయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండరాదన్నారు. ఈ విషయంలో చిత్తశుద్ధిని చాటాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.





## ఆక్రమణ కూల్చివేతలకే హైడ్రా ఏర్పాటు

### పదేళ్ల కాలంలో ఆక్రమణలపై దృష్టి పెట్టాం

### ప్రజలు ఆక్రమణల కూల్చివేతలను హర్షిస్తున్నారు

### ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై డిప్యూటి సిఎం భట్టి

న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమర్థించారు. గత కొన్నేళ్లుగా రాజధానిలో చెరువులను, ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసి అక్రమ నరి÷-మాణాలు చేప్టారని అన్నారు. వీటిని కూల్చేయడం సరైందేనని అంటూ..ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ...హైదరాబాద్ నగరం అంటేనే లేక్స్, రాక్స్ అని.. వీటిని కాపాడుకోవాలంటూ పర్యావరణవేత్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశారన్నారు. చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. చెరువులు ఏవీ ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించడం కోసం ఏర్పాటు చేసిందే హైడ్రా అని చెప్పుకొచ్చారు. దీన్ని ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రతి పనికి నోటీసులు ఇచ్చి ఆపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. బఫర్ జోన్‌లో కాదు, నేరుగా చెరువులోనే కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్నారన్నారు. సాటిలైట్ ఫోటోల ద్వారా విభజనకు ముందు, విభజన తర్వాత ఈ 10 ఏళ్లలో చెరువులు ఎంత మేర ఆక్రమణకు గురయ్యాయి తెలుసుకుంటున్నామని తెలిపారు. రిమోట్ సెన్సింగ్ సాటిలైట్ ఫోటోలను తీసి, అంతకుముందు ఎన్ని చెరువులు ఉండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయి అన్నది ప్రజల ముందు పెడతామన్నారు. చట్ట ప్రకారం, చట్టానికి లోబడి మాత్రమే చర్యలు చేపడతున్నామన్నారు. అన్నీ లెక్కలతో సహా ప్రజల ముందు పెడతామన్నారు. ప్రజల ఆస్తులను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ప్రజాస్వామ్యానికి సవాలుగా మావోయిస్టుల హింస

రాయ్‌పుర్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి సవాలుగా మారిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పటివరకు 17 వేలమంది దీనికి బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2004-14 వ్యవధితో పోలిస్తే 2014-24 మధ్యకాలంలో నక్సల్స్ సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

## మహిళల పట్ల యధాలాపంగా వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి...**

కామెంట్స్ చేశారని మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి నోటీస్ ఇచ్చింది. ఈ క్రమంలోనే ఇవాళ కేటీఆర్ మహిళ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే ఆయన క్షమాపణ చెప్పారు. యథాలాపంగా అన్నవే తప్పా మహిళలను అవమానించే ఉద్దేశం తనకు లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## వరంగల్ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**మొదటి పేజీ తరువాయి...**

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి, పలు సూచనలు చేశారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, రోడ్లు భవనాలు శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, కుడా వైస్ చైర్మన్, కమిషనర్ అశ్విని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, కన్‌స్టలెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సామాజిక భద్రతకు నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి...**

పథకంలో విలీనం చేసింది. ఈ పథకం కోసం 2021-22 నుంచి 2025-26 వరకు 15వ నాన్స్ కమిషన్ కాలానికి రూ.10,579 కోట్లను కేటాయించారు. ఈ పథకంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో మానవ సామర్థ్యం పెంపు, పరిశోధనలు, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధి, విస్తరణపై ప్రత్యేక దృష్టి కేంద్రకరించనున్నారు. అలాగే కేంద్రమంత్రి మండలి కొత్త పెన్షన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకంలో 25 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధిపొందనున్నారు.

## వైద్య రంగాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం

### బిఆర్ఎస్ పాలనలో అద్భుతంగా అభివృద్ధి చేశాం

### ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి

హైదరాబాద్, ఆగస్ట్ 24 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వైద్య రంగం ఉన్నత శిఖరాలకు చేరిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అనేక విప్లవాత్మక పథకాలకు, తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. నిర్దిష్టమైన ప్రణాళిక, పటిష్టమైన చర్యలతో వైద్యరంగంలో అట్టడుగున ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని హరీశ్‌రావు అన్నారు. కానీ ఈ తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్య, ఆరోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. కాంగ్రెస్ పాలన పుణ్యమా అని మళ్లీ.. 'నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు' అనే రోజులు పునరావృతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పటల్స్ ఘనతను చాటేలా వార్తలు వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల అధ్వాన్న పరిస్థితుల గురించి రోజూ వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'పడకేసిన ప్రజారోగ్యం, రోగుల మందులు ఎలుకల పాలు, కుర్చీలోనే గర్భిణీ డెలివరీ, ఒకే బెడ్ పై ముగ్గురికి ట్రీట్మెంట్' ఇవన్నీ ఈ ఒక్క రోజు పత్రికల్లో వైద్య ఆరోగ్యశాఖపై నిర్వాకంపై వచ్చిన వార్తా కథనాలు అని ప్రస్తావించారు. ప్రజారోగ్య సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వా నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని తెలిపారు.

వానాకాలం వస్తున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఆస్పత్రుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించకపోవడం పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల మలేరియా, డెంగీ లాంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. ప్లలె, పట్టణం అని తేడా లేకుండా వైరల్ ఫీవర్లతో ప్రతి ఇద్దరిలో ఒకరు బాధపడుతున్నారని.. ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గడచిన నెలన్నర కాలంలో 5246 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే 36? డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయని అన్నారు. జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు? అని మండిపడ్డారు. మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు ఏమని సమాధానం చెబుతుందని నిలదీశారు. మీకు రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంతోమంది కుటుంబాల్లో అంతులేని దుఃఖాన్ని మిగిలించిందని అన్నారు. ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని స్పష్టం చేశారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మరణించిన వారికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటే ఇంకా




ఎన్ని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య ఆరోగ్యశాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే

## ముఖ్య అతిథిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి




మొయినాబాద్,24(ప్రభాత ఉదయం) విద్యార్థులు ఉన్నత విద్యలో పాల్గొనే వారందరు సంపూర్ణ అభివృద్ధికి సమర్థవంతమైన విద్యను అభ్యసించినప్పుడే మీ జీవితాలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, అనురాగ్ విద్యా సంస్థల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్ నగర్ చౌరస్తాలో గల విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లా రాజేశ్వర్రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన అధ్యాపకులతో పాటు పరిశోధన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు రెగ్యులర్ గా కళాశాలలకు హజరై క్రమ శిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. సాంకేతిక రంగంలో నైపుణ్యం పెంచుకునే విద్యార్థులకు అపారమైన అవకాశాలు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు సంపూర్ణమైన అభివృద్ధికి, సమర్థవంతమైన కమ్యూనికేషన్, నైపుణ్యమే ప్రధానమని సూచించారు. ఒక పక్కా విద్యా సంస్థ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తుందని మరో పక్క తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి వారి నడవడికలను తెలుసుకోవాలన్నారు. కేవలం కళాశాలకు పంపుతున్నామని అనుకోని సరిపోతే కాదని వారి పట్ల మీ కృషి కూడా ఉండాలని ఆయన సూచించారు. నాలుగు సంవత్సరాల పాటు కష్టం అనకుండా ఇష్టంతో విద్యార్థులు చదువుకుంటే మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చినవారు అవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిబాబారెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ పద్మజ, అకాడామిక్ కోఆర్డినేటర్ శ్రీలత, కళాశాల ఏవో వెంకటాచలం, హెచ్ఓడీలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

# ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏ ఎస్ ఐ డి. ప్రకాష్ రావు

బుద్వేల్, ఆగస్టు24(ప్రభాత ఉదయం): మహిళా భద్రత, ర్యాగింగ్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం.పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో శనివారం విద్యార్థులకు సైబరాబాద్ పోలీస్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ డి. ప్రకాష్ రావు, షీ టీం బృందం విద్యార్థులకు వీడియోలు, పోస్టర్లు, మొబైల్ యాప్ వినియోగం, సైబర్ నేరాలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్వీయ రక్షణ విన్యాసాలను మహిళా విద్యార్థులకు ప్రదర్శన ద్వారా అందించడం జరిగింది. యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం జరిగింది. అదేవిధంగా డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా నషాముక్తి భారత్ అభియాన్ లో భాగంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రుద్రమదేవి స్వీయ రక్షణ బృందం ఆధ్వర్యంలో పోకిరీల నుంచి మహిళలు ఎలా తమంతట తాము ఎదుర్కోవాలో శిక్షణ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షీ టీం రాజేంద్రనగర్ బృందం బాలరాజ్, సురేష్, కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్ రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, విద్యార్థి వ్యవహారాల ఇంచార్జ్ పాల్గొని యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలను ముగించడం జరిగింది.



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలసిన కురుమ సంఘం నాయకులు

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలసిన కురుమ సంఘం నాయకులు

రాజేంద్రనగర్, ఆగస్టు24(ప్రభాత ఉదయం): బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సభ్యులు శనివారం ఉదయం కార్పొరేటర్ సాగర్ గౌడ్, కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్ కొత్తగా ఎన్నికైన సంఘం సభ్యులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు పరిచయం చేశారు. ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్, గండిపేట్ మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఈదలకంటి యాదయ్య ఆధ్వర్యంలో సంఘం సభ్యులు భవన నిర్మాణం కోసం స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు కె.నరేష్ కుమార్. మల్లేష్, విజయ్ కుమార్, కె వెంకట్,పి రమేష్ జనరల్ సెక్రటరీ లు కె.లక్ష్మణ్. కె.సత్యనారాయణా, ఎస్.విట్టలయ్య, ఎం.జగదీశ్వర్, ప్రచార కార్యదర్శి బుడిగె బాబురావు, కార్యవర్గ సభ్యులు డి.బాలకృష్ణ పి మనోహర్ పి బాలరాజు, ఎం .సతీష్ ఏ సాయికాంత్, ఎం శ్రీశైలం,బి ఆంజనేయులు, కె. సత్యనారాయణ, ఏ శ్రీశైలం, బి రమేష్. టీ నర్సింలు,జి కృష్ణయ్య వి వెంకటేష్ కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్ నగర్‌లో ఐరా రెస్టారెంటు ప్రారంభోత్సవంలో

# మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

మొయినాబాద్,24(ప్రభాత ఉదయం) నగర శివారు మొయినాబాద్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అందుకు అనుగుణంగా ప్రజలకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని.నూతనంగా ఏర్పాటు చేసే రెస్టారెంటు నిర్వహకులు వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్లో స్థానికులు తెర రాజగోపాల్రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాట్, సంపత్లు నూతనంగా ఏర్పాటు చేసిన ఐరా రెస్టారెంటు ప్రారంభోత్సవంలో శనివారం ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఫుడ్ సెక్యూరిటీ నిబంధలకు అనుగుణంగా ఆహారాన్ని వినియోగదారులకు అందించినప్పుడే ప్రజల్లో మ ంచి అభిప్రాయం ఏర్పడుతుందని చెప్పారు. దినదిన అభివృద్ధి చెందుతున్న మొయినాబాద్ లో ఇలాంటి బహుల అంతస్తుల హోటళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల జీవనశైలిలో మార్పు వస్తుంటుందని చెప్పారు. ఇటీవల నగరంలో అనేక హోటల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఫుడ్ సెక్యూరిటీ అధికారులు హోటళ్లను మూసి వేసినట్లు మంత్రి గుర్తుచేశారు. నగర శివారు మొయినాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని అందుకు అనుగుణంగా వసతులు కూడా ఏర్పాటవుతుండడం ఎంతో అభినందనీయమన్నారు. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుల డడం.. తమ ప్రభుత్వం కూడా మరింత సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ భీంభరత్, సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కీసరి సంజీవరెడ్డి హోటల్ నిర్వహకులు పాల్గోన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బద్దం మహిపాల్ రెడ్డి

# రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా వై. శ్రీధర్

బుద్వేల్, ఆగస్టు 24(ప్రభాత ఉదయం):రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి సమావేశం శనివారం సాయంత్రం ఉప్పర్ పల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధి గణేష్ ఉత్సవ సమితీ కన్వీనర్ బద్దం మహిపాల్ రెడ్డి , భాగ్యనగరం గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రమేష్ లు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ హిందూ ఐక్యత కోసం ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలు సామూహిక నిజ్జనాలు ఊరేగింపులు మన ఐక్యత పెరుగుతుందని అన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 1983 లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పిటి టైగర్ ఆలె నరేంద్ర. బద్దం బలరెడ్డి. బండారు దత్తాత్రేయ ల ఆధ్వర్యంలో సామూహిక ఊరేగింపుగా వినాయకులను ట్యాంక్ బండ్ లో సామూహిక నిమజ్జనం చేయడం జరిగిందన్నారు.

### రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా వై శ్రీధర్



రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా వై శ్రీధర్ నియమితులయ్యారు. జాయింట్ కన్వీనర్లుగా గా బొక్క బాల్ రెడ్డి , రాజ్ పాల్ రెడ్డి గారు నియనింప బడ్డారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి అంజన్ కుమార్ . మైలర్ దేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మల్లా రెడ్డి , పి మల్లేష్ యాదవ్ , బి మహాలింగం జిల్లా కార్యదర్శి ఎం కొమరయ్య , బీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నారాయణ , డివిజన్ అధ్యక్షులు జి బాబురావు. ఎస్. విజయ్ కుమార్ ఏ. జనార్ధన్. భిక్షపతియాదవ్ . నిఖిల్. నాగేష్ మురళీ ధర్ రెడ్డి జగన్ పి స్ మల్లారెడ్డి శ్రీకాంత్ రెడ్డి కిరణ్ చారి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు

రాజేంద్రనగర్, ఆగస్టు24(ప్రభాత ఉదయం): బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ పరిధిలో శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కార్పొరేటర్ లంకల నిఖిలా సంగారెడ్డి మేయర్ లతా ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి తో కలిసి కోటి రూపాయల నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కిస్మత్పూర్ బిడ్జి ఇరువైపులా పెన్సింగ్ , శ్రీకృష్ణ కాలనీలో పెద్దల కమ్యూనిటీ హాల్, అపోలో ఫార్మసీ నుండి స్వామి వివేకానంద విగ్రహం వరకు బిటి రోడ్ తదితర పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలో మూడు కోట్ల 25 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఈ సందర్భంగా కార్పొరేటర్ నిఖిలా సంగారెడ్డి తెలిపారు ప్రస్తుతం ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ చేతుల మీదుగా కోటి రూపాయలతో పనులకు శంకుస్థాపన చేయించినట్టు వెల్లడించారు. మిగిలిన రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు టెండర్లలో ఉన్నాయని వాటిని పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కిస్మత్పూర్ గ్రామ పెద్దలు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మున్సిపాలిటీ కమీషనర్ తో పాటు వివిధ విభాగాల అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటి గోడలు కూలి హనుమంతు అనే కార్మికుడు మృతి



బుద్వేల్, ఆగస్టు24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హసన్ నగర్ లో శనివారం పాత ఇల్లు కూల్చివేస్తున్న ఒక కార్మికునిపై ఇంటి గోడలు కూలి పడడంతో అతను తీవ్ర గాయాలకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హసన్ నగర్ లో షరీఫ్ కు ఓ పాత ఇల్లు ఉంది. దాన్ని కూల్చి కొత్త ఇల్లు కట్టాలని అనుకున్నాడు. ఇల్లు కూల్చే పనులను యూసుఫ్ అనే కాంట్రాక్టర్ కు అప్పగించాడు. యూసుఫ్ ఆ పనులను మహబూబ్ నగర్ ప్రాంత నివాసి హసన్ నగర్ లో ఉంటున్న హనుమంతుకు సబ్ కాంట్రాక్ట్ కు ఇచ్చాడు. దీంతో హనుమంత పాత ఇంటిని కూలుస్తున్న క్రమంలో గోడలు ఆయనపై పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అనారోగ్య కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య



అబ్దుల్ గౌస్

బుద్వేల్, ఆగస్టు24(ప్రభాత ఉదయం) : రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చున్నీ తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి హసన్ నగర్ లో జరిగింది . అబ్దుల్ గౌస్(22) రెండు నెలలుగా పనికి వెళ్లడం లేదు. మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం అతని స్నేహితులు ఫోన్ చేయగా ఫోన్ తీయలేదు. దీంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వచ్చి అబ్దుల్ గౌడ్ ఉన్న గదిలో చూడగా తలుపులు పెట్టి ఉన్నాయి. ఎంతకు తలుపులు తీయకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఇంట్లో ఫ్యాన్ కు చున్నితో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# ఫిరంగినాలలను కబ్జా చేసిన అపర్ణ, సుమధుర బిల్డర్స్‌పై చర్య తీసుకోండి

## కౌన్సిలర్ బద్రు నాయక్




శంషాబాద్,ఆగస్టు 24 (ప్రభాత ఉదయం) శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని సాతం రాయి లొ అపార్ట్మెంట్స్ నిర్మిస్తున్న సుమధుర. అపర్ణ సంస్థలు ఫిరంగినాలను కబ్జా చేసి భారీ భవనాలను నిర్మిస్తున్నారని స్థానిక కౌన్సిలర్ బద్రు నాయక్ ఆరోపించారు. శంషాబాద్ పైభాగం నుండి వస్తున్న ఫిరంగినాలను ఈ రెండు సంస్థలు పూడ్చివేసి భవన నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫిరంగినాలకు మోక్షం కలిగించాలని బద్రునాయక్ డిమాండ్ చేశారు. ఓవైపు నగరంలో హైడ్రా ఆధ్వర్యంలో చెరువులో నాళాలపై నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్నప్పటికీ శాతం రాయి గ్రామంలో మాత్రం యదేచ్చగా కాల్వ ఆక్రమణ జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిరంగినాలను కనుమరుగు చేస్తున్న విషయమై ఇరిగేషన్. రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని బదృనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరంగినాల పూర్తిగా మూసివేయడంతో భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

# నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం

బుద్వేల్, ఆగస్టు24(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ సన్ సిటీ ప్రాంతంలో శనివారం రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసులు దాడులు చేసి 50 గ్రాముల ఎండి ఎంఏ డ్రగ్ ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ను సరఫరా చేస్తున్న నైజీరియన్ కు చెందిన స్తంభ ఫిడిల్మా ( 30) ను అరెస్టు చేశారు. గత కొంతకాలంగా స్తంభ ఫిడిల్మా సన్ సిటీ ప్రాంతంలో నిషేధిత ఎండి ఎంఏ డ్రగ్ ను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు. ఆమె ఎక్కడి నుంచి డ్రగ్ తీసుకువస్తుంది... ఎప్పటినుంచి విక్రయాలు చేస్తుందనే వివరాలు తెలియాల్సి ఉంది. రాజేంద్రనగర్ ఎస్ ఓ టి పోలీసులు ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.







చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

# హైదర్‌గూడ టైనీ స్కాలర్స్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

బుద్వేల్, ఆగస్టు24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ టైనీ స్కాలర్స్ హై స్కూల్ లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో పలువురిని ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ నాగ సీత ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

# ప్రజలకు ఉపయోగపడే విధంగా తెలంగాణ భూ హక్కుల రికార్డు ముసాయిదా చట్టం 2024: డాక్టర్ జి చిన్నారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి ,ఆగస్టు24(ప్రభాత ఉదయం) తెలంగాణ భూ హక్కుల రికార్డు ముసాయిదా చట్టం 2024 లో చేయాల్సిన మార్పు చేర్పుల పై ప్రజలు ఇచ్చే సలహాలు సూచనలు అన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐ.డి. ఒ.సి) సమావేశ మందిరంలో కొత్త (ఆర్. ఒ.ఆర్ బిల్లు - 2024) తెలంగాణ భూ హక్కుల రికార్డు ముసాయిదా చట్టం - 2024 పై సలహాలు సూచనలు చేసేందుకు న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా కలక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ భూహక్కుల రికార్డు ముసాయిదా చట్టం 2024 లో పొందుపరచిన అంశాలు ఎంటి, ధరణి పోర్టల్ లో ఉన్న అంశాలు ఎంటి, 2020 లో తెచ్చిన ధరణి చట్టాన్ని మార్చి కొత్తగా చట్టం చేయాల్సినవవసరం ఏమొచ్చింది అనే అంశాలను నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భువని సునీల్ కూలంకషంగా విడమరచి వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సునీల్ మాట్లాడుతూ... 1936 నుండి ఇప్పటి వరకు (6) భూ చట్టాలను తీసుకురావడం జరిగిందని, 2020 లో తెచ్చిన ధరణి చట్టం ద్వారా చాలా సమస్యలు వచ్చి పడ్డాయని అన్నారు. కొన్ని లక్షల ఎకరాల భూమి పార్ట్ బి లో చేరిపోయిందని, భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారుల వద్ద ఎలాంటి అధికారం లేకుండా పోయిందన్నారు. అన్ని సమస్యలకూ ట్రిబ్యునల్ ను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అందుకే ధరణి చట్టంలో మార్పులు చేస్తూ కొత్త చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. 2024 చట్టం ద్వారా వ్యవసాయ భూమితో పాటు వ్యవసాయేతర భూమికి సైతం హక్కుల రికార్డు అందజేసే వీలు కల్పించిందన్నారు. (20) సెక్షన్ లలో రూపొందించిన కొత్త చట్టం పాత చట్టాల్లో ఉన్న మంచి విషయాలను ప్రాతిపదికగా చేసుకొని భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా చట్టం రూపొందించడం జరిగిందన్నారు. సమస్యలు లేకుండా తమ భూమికి సంబంధించిన భూహక్కుల రికార్డు తయారు కావడం, అదేవిధంగా భూహక్కులు మారినప్పుడు సమస్యలు లేకుండా న్యాయబద్ధంగా రికార్డులు మారడం కొత్త చట్టంలో ప్రధాన అంశాలుగా తెలియజేశారు. ధరణి సవరణకు సైతం ఈ చట్టంలో అవకాశం కల్పిస్తుందన్నారు. సెక్షన్ -4 ప్రకారం పార్ట్ బి లో ఉన్న వాటిని సైతం మార్పులు చేసుకోవచ్చని చెప్పారు.



ఆధార్ కార్డు మాదిరి ప్రతి భూకమతానికి ముందుగా తాత్కాలిక భూదార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, సమగ్ర సర్వే తర్వాత శాశ్వత భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. మ్యూటేశ్ విషయంలో 18 రకాలుగా భూ బదలాయింపు జరిగేందుకు అవకాశం ఉందని మ్యూటేశన్ సమయంలో రెవెన్యూ అధికారుల ద్వారా విచారణ చేసి గడువులోగా మ్యూటేశన్ చేయడం కొత్త చట్టంలో నిర్దేశించడం జరిగిందన్నారు. భూమి అమ్మకం కొనుగోలు సమయంలో ఏదైనా అన్యాయం జరుగుతుందని సదరు వ్యక్తి భావిస్తే మ్యూటేశన్ కాకుండా ఆపే అధికారం రెవెన్యూ అధికారులకు కల్పించడం జరిగిందన్నారు. సాదా బైనామాలను సైతం క్రమబద్ధీకరించేందుకు కొత్త చట్టంలో అవకాశం కలించడం జరిగిందన్నారు. రికార్డుల సవరణకు, చిన్న చిన్న తప్పులను సవరించుకునేందుకు కోర్టుకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారులకు అప్పీల్ చేసుకునే సదుపాయం కొత్త చట్టంలో అవకాశం కల్పించిందన్నారు.

తదుపరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టంలో ఇంకా మెరుగైన విషయాలు చేర్చడానికి, అత్యధిక ప్రజలకు ఉపయోగపడే అంశాల పై సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా సదస్సుకు విచ్చేసిన ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, రెవెన్యూ, ఉపాధ్యాయ ఉద్యోగులను రిటైర్డు ఉద్యోగులను కోరారు. చాల మంది తమ అభిప్రాయాలను తెలియపరుస్తూ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి మాట్లాడుతూ ధరణి లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రజలకు మేలు కలిగే విధంగా కొత్త భూహక్కుల చట్టం తీసుకురావడం జరుగుతుందన్నారు. సహజ సిద్ధమైన భూమి పై హక్కులను కల్పించేందుకు 1853లో అప్పటి నవాబు సాలార్జన్ సర్వే చేసి భూ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎవరెస్ట్ చేత సర్వే చేయించి చైనా సిల్క్ బట్ట పై నక్షా ముద్రించడం జరిగిందన్నారు. గ్రామాల్లో భూ రికార్డులను కాపాడటానికి అధికారి ఉండాలని సూచించారు త్వరలో కవులు రైతులకు న్యాయం చేయడానికి కవులు చట్టం రాబోతుందని తెలియజేశారు. భూ రికార్డుల విషయంలో అధికారులు తప్పులు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కొంత మంది స్వలాభం కోసం ధరణి చట్టాన్ని తీసుకువచ్చారని, ధరణి వల్ల అన్నదమ్ముల మధ్య పంచాయతీలు ఏర్పడ్డాయని అన్నారు. ధరణి వల్ల దాదాపు 20 లక్షల పట్టా భూములు ప్రోహిబిటెడ్ జాబితాలో చేరాయని వాపోయారు. గ్రామాల్లో దేవాలయ భూముల చాలా ఉన్నాయని వాటికి సైతం భూ హక్కులు కల్పించే విధంగా చట్టంలో అవకాశం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుండి తిరిగి తీసుకోడానికి హైడ్రా కమిటీ జిల్లాలలో సైతం రాబోతుందన్నారు. కొత్త చట్టంలో ఏమైనా మార్పులు చేర్పులకు సలహాలు ఇస్తే ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని శాసనసభ్యులు తెలిపారు.

మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ధరణిలో చిన్న తప్పు జరిగితే సరి చేసుకోడానికి వీలు లేకుండేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ చట్టం తీసుకువచ్చిన ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి తర్వాత చట్టం రూపొందిస్తుందన్నారు. మొన్న రైతుభరోసా, నేడు భూ హక్కుల చట్టం పై ప్రజల నుండి సలహాలు సూచనలు తీసుకుంటుందన్నారు. భూమి కలిగిన ప్రతి ఒక్కరూ తమ భూమి సంబంధించిన హక్కులు ఏ విధంగా పొందవచ్చు అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే రైతులు మోసపోకుండా ఉంటారన్నారు. చట్టాన్ని మంచి కొరకు ఉపయోగించాలి తప్ప చెడు కొరకు ఉపయోగించవద్దని ఎవరైనా ఉద్దేశ్య పూర్వకంగా తప్పు చేస్తే శిక్షలు పడే విధంగా చట్టంలో ఉండాలన్నారు.

దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ...చట్టాలను రూపొందించడంలోప్రజా ప్రభుత్వం ప్రజలను భాగస్వాములను చేస్తుందన్నారు. ధరణి పోర్టల్ ఏజెన్సీల అవగాహన లోపం వల్ల పట్టా భూములు ప్రొహిబిటెడ్ జాబితాలో చేరిందని అన్నారు. దొరల భూమిని కాపాడుకోవడానికి చేసిందే ధరణి చట్టం అని చెప్పారు. ఇలాంటి విచారణ లేకుండా రాత్రికి రాత్రి ప్రభుత్వ భూమి పట్టాభూమిగా ను పట్టా భూమి ప్రభుత్వం మార్చారని విమర్శించారు. ధరణిలో సమస్యలు వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలనేది లేదని గుర్తు చేశారు. ప్రజల భూ సమస్యలు తొలగించి శాశ్వత పరిష్కారానికి కొత్త భూ హక్కుల చట్టం తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డీవో పద్మావతి, మున్సిపల్ చైర్ పర్సన్ పి మహేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మదనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, సి. సెక్షన్ సుపరిన్డెంట్ కిషన్ నాయక్, ప్రజాప్రతినిధులు, బార్ కౌన్సిల్ సభ్యులు, సంఘాల నాయకులు, ఉపాద్యాయులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.సి.బి చైర్ పర్సన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ టిపన్ కేటాయించే విధంగా చూడాలని సూచించారు.



కొత్త కోట పట్టణ కేంద్రంలో సాయి ట్రేడర్స్ నుఎంఎల్ఏ జి ఎం ఆర్

# జనాభా కనుగుణంగా వ్యాపార సంస్థలు రావాలి: ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్త కోట,ఆగస్టు24(ప్రభాత ఉదయం) జనాభా కనుగుణంగా కొత్తకోట పట్టణ కేంద్రంలో వ్యాపార సంస్థలు నెలకొల్పాలని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సాయి ట్రేడర్స్ ను ముఖ్యఅతిథిగా హాజరై సాయి ట్రేడర్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొత్తకోట మండలం రాయిని పేట గ్రామానికి చెందిన కిషన్ నాయక్ కి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు.

# ముదిరాజులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

## మెరుగు సురేష్ ముదిరాజ్



శంషాబాద్ ,ఆగస్టు 24( ప్రభాత ఉదయం) రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని శంషాబాద్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెరుగు సురేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. జనాభాలో 50 లక్షలకు పైగా ముదిరాజులు ఉన్నప్పటికీ రాజకీయాలలో తగిన ప్రాముఖ్యత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్ కులం నుండి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీహరి కి లేదా యువ నాయకుడు నీలం మధు ముదిరాజ్ కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు నీలం మధు ముదిరాజ్ కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రివర్గంలోకి తీసుకోవాలని ముదిరాజుల చిరకాల కోరిక అని సురేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. రాజకీయాలలో చురుకుగా వ్యవహరిస్తూ ముదిరాజుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న నీలం మధు ముదిరాజ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగిన గుర్తింపు నివ్వాలని కోరారు. జనాభాలో ముదిరాజులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ మంత్రివర్గంలో ఒకరికి కూడా చోటు లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ముదిరాజులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తే అందరూ కాంగ్రెస్ వెంటనే ఉండి బ్రహ్మరథం పడతారని సురేష్ పేర్కొన్నారు.



# కొత్తకోటలో వాహేద్ షా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు

కొత్తకోట,ఆగస్టు 24( ప్రభాత ఉదయం) కొత్తకోట మండల కేంద్రంలోని బైపాస్ నేషనల్ హైవే 44 దగ్గర ఉన్న దర్గా సయ్యద్ వాహేద్ అలీ షా ఖాద్రీ (జిందా షా వలి) ఖాద్రి ఉర్సు ఉత్సవాలు ఆదివారం నుండి మంగళవారం వరకు జరుగనున్నాయి. ఈ నెల 25 ఆదివారం సాయంత్రం 7 గంటలకు గంధంమహోత్సవం పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ వహీద్ ఖాద్రి ఇంటి నుండి ఊరేగింపుగా బయలుదేరి చౌరస్తా మీదుగా పొట్టి శ్రీరాములు చౌరస్తా గుండా రాత్రి 11 గంటలకు దర్గా దగ్గర చేరి ప్రార్థనలు చేయనున్నారు. ఈ నెల26 తేది ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి ఆగస్టు27 మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు దర్గా దగ్గర పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ వహీద్ ఖాద్రి తరుపున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కులాలకు మతాలకు అతీతంగా భక్తులు పాల్గొంటారని పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ వహీద్ ఖాద్రి తెలిపారు.



సీజ్ చేస్తున్న అధికారులు

# సీఎంఆర్ బియ్యం సరఫరా చేయకపోవడంతో ఆస్తులు జప్తు

కొత్తకోట,ఆగస్టు 24 (ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం నాటవెల్లి రేస్ మిల్లు యజమాని ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం ఇవ్వకపోవడంతో అధికారులు రైస్ మిల్ సీజ్ చేశారు. శనివారం అర్ఆర్ యాక్ట్ షెడ్యూల్ కింద రైస్ మిల్ యజమాని ఆస్తులను జప్తు చేయాలని ఈ నెల 8 న వనపర్తి ఆర్డిఓ ఆదేశాలు జారీ చేయడంతో శనివారం అధికారులు అతని ఇంటికెళ్లి ఆస్తులు జప్తు చేశారు.అధికారులు స్వాధీనం చేసుకున్న వస్తువులు స్విఫ్ట్ డిజైర్ కారు,ఎల్జీ ఫ్రీజ్,ఎల్జీ ఏసీ,సాన్యో ఎల్ఈడి టివి ,లుమినస్ ఇన్వర్టర్ లను సీజ్ చేసి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో,ఎంసీ,డిప్యూటీ తహసిల్దార్ ,రెవిన్యూ ఇన్స్పెక్టర్ తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఇగా డి శ్రీరామ్ మోహన్

మెహదీపట్నం, ఆగస్టు24(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ నూతన సూపర్డెంట్ ఇంజనీరుగా డి రామ్మోహన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. శనివారం మెహిదీపట్నంలోని నానల్ చౌరస్తాలో గల ఎస్ ఈ కార్యాలయంలో రామ్మోహన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్ ఈ గా పదవి బాధ్యతలు స్వీకరించి న రామ్మోహన్ కు డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) రామచంద్రయ్య పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రామ్మోహన్ మేడ్చల్ ఎస్సీగా పనిచేసే రాజేంద్రనగర్ కు బదిలీపై వచ్చారు. రాజేంద్రనగర్ లో ఎస్ ఈ గా పనిచేసిన ఎల్ గోపయ్య సికింద్రాబాద్ సర్కిల్ ఏసీగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూత న ఎస్ ఈ రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ వినియోగదారులకు సేవలు అందిస్తూ ఎలాంటి సమస్యలు లేకుండా ముందుకు వెళ్తామన్నారు.



రాజేంద్రనగర్ సర్కిల్ నూతన ఎస్ ఈ శ్రీరామ్ మోహన్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న డి ఈ రామచంద్రయ్య

# డంపింగ్ యార్డ్‌గా మారిన బస్తీ దవాఖానా

కొత్తకోట, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని మదనపురం రోడ్డు వైపు గల బస్తీ దావఖాన పేరుకు మాత్రమే కొనసాగుతుందని ప్రజలు చత్త చెదారం వేయడంతో డంపింగ్ యార్డ్ గా మారిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వము కరోనాకాలంలో ఈ ప్రాంత కాలనీ వాసులకు వైద్యము అందించాలనే ఉద్దేశంతో ఇక్కడ బస్తి దావఖాన ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రారంభంలో ఒక డాక్టర్ ను తాత్కాలికంగా నియమించడం జరిగింది. మైనార్టీలు, రెడ్డిస్, వీవర్స్ కాలనీ,వాసులు బీడీ కార్మికులు ప్రతిరోజు వైద్యం కొరకు 40 నుంచి 50 మంది వైద్య చికిత్స పొందేవారని,ప్రస్తుతము సంవత్సరం నుండి డాక్టర్ రావడం బంద్ అయిందని చెప్పారు. కేవలం ఒక ఆశ కార్యకర్త మాత్రమే ప్రతిరోజు రావడం,ఆసుపత్రికి రోగులు రావడం మానుకున్నారని అన్నారు. కాంపౌండ్ వాల్ ఆవరణలో చెత్తాచెదారం కంకర బొడ్డెలు వెలుగు ఆఫీస్ కు సంబంధించిన రైతు పనిముట్లు, నాగళ్ళు, ఇక్కడ పడి ఉన్నాయి వీటితోడు పేషెంట్లను చూడడానికి డాక్టరు కు గది లేకపోవడం మరి దారుణమని ఆయన ఆరోపించారు. ఇందులోనే వికలాంగుల పునరావాస కేంద్రం ఉంటుంది.రెండు నెలల క్రితం మహిళ కుట్టు కేంద్రం ఏర్పాటు చేశారని,వాటితో పాటుగా చెప్పా చేయకుండా ఒక ట్రాన్స్ఫారం కొరకు హుటాహుటిన పిల్లర్స్ నిర్మించారని రెండు గదులు మాత్రమే ఉన్నా భవనంలో వైద్య పరమైన సేవలు మూత పడ్డాయని అన్నారు.వికలాంగులకు ఏర్పాటు చేసిన ఈ భవనంలో సౌకర్యాలు సరిగా లేకపోవడం దురదృష్టకరమని చెప్పారు. దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి బస్తీ దవఖాన ను పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ వీటి పైన దృష్టి పెట్టి తక్షణమే చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను ప్రస్తుతం సీజన్ వ్యాధులు మలేరియా టైఫాడు డెంగ్యూ జలుబు దగ్గు జ్వరాలు రావడం జరుగుతుంది వీటి పైన వైద్యము అందించాలంటే డాక్టరు అవసరం ఉంది, కానీ డాక్టర్ లేకుండా బస్తి దావఖానా ఏర్పాటు చేయడం మరి దారుణమని ఆయన ఆరోపించారు పరిశుభ్రత లేకపోవడం, బాత్రూంలేకపోవడం,మంచినీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యొక్క దావఖానలో బ్లీచింగ్ పౌడర్ ,ఫినాయిల్ తో శుభ్రం చేయాలి ఇలాంటివి ఏమీ కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. డాక్టర్ లేనందువలన బిపి షుగర్ జ్వరం దగ్గు సర్దతో వచ్చిన వారికి ఆశ కార్యకర్తలు టాబ్లెట్స్ అందిస్తున్నారు ప్రభుత్వ బస్తి దవాఖాన లో అన్ని సౌకర్యాలతో పాటు డాక్టర్ ను నియమించాలని కోరారు.



# ఎన్టీఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## ఆకట్టుకున్న చిన్నారుల వేషాధారణ

మొయినాబాద్ ఆగస్టు 24(ప్రభాత ఉదయం) మండలం లోని ఎన్టీఆర్ విద్యాసంస్థల విద్యార్థులుఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ సంస్థల డీన్ రామారావు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పండగ వెనుక ఒక చరిత్రాత్మకమైన అంశం ఉంటుందని దాన్ని విద్యార్థులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు రాధా కృష్ణ,గోపిక వేషధారణతో చిన్నారులుపాఠశాల్లో నృత్యాలు చేయించారు. దీంతో పలువురిని ఆకట్టుకున్నాయి. అలరించారు.అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.